సాక్షి
కాకినాడ

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



అమ్మవార్లకు వెండి కిరీటాలు

పి.గన్నవరం: పోతవరం గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు డాక్టర్ నెక్కంటి సుధాకరరావు, లక్ష్మీ సరోజిని దంపతులు శనివారం రూ.90 వేల వెండి కిరీటాలు సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 4,77,227 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది.

'మట్టి' మేలు తలపెట్టవోయ్



మట్టి ప్రతిమలతో వినాయకుని కొలవడం పర్యావరణ హితమని కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ కార్యాలయ ఈఈ సందీప్ రెడ్డి అన్నారు. సాక్షి మీడి యా గ్రూపు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీప్రకాష్ సీనర్జీ స్కూల్‌లో చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు కార్యక్రమాన్ని నిర్వహించాయి.

8లో



అశేష జనవాహినికి
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం



సభా వేదికపై సీఎం జగన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

నిడదవోలు.. జనహోరు

- సీఎం జగన్‌పై అడుగడుగునా వెల్లువెత్తిన అభిమానం
- వైఎస్సార్ కాపు నేస్తం సభకు పోటెత్తిన ప్రజానీకం
- సభ ప్రారంభం నుంచి ముగింపు వరకూ మిన్నంటిన 'సీఎం' నినాదాలు
- ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజలు

సాక్షి, రాజమహేంద్రవరం: తమ ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో అశేష ప్రజానీకం నీరాజనం పట్టారు. వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద కాపు, బలిజ, తెలగ, ఒంటరి సామాజికవర్గాల్లోని అక్కచెల్లెమ్మలకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు వచ్చిన జననేతకు జేజేలు పలికారు. వెల్లువలా తరలివచ్చిన ప్రజలు 'జై జగన్.. సీఎం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా.. మిన్నంటేలా ముక్తకంఠంతో నినదించారు. అడుగడుగునా అభిమానం చూపుతూ అక్కున చేర్చుకున్నారు. కాపు మహిళలు తమ సొంత సోదరుడు, బిడ్డ వచ్చినట్టే భావిస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. హెలిపాడ్ నుంచి సభా ప్రాంగణం వరకూ సీఎం జగన్‌పై పూలవర్షం కురిపించారు. నిడదవోలు పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో.. రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్ కాపు నేస్తం పథకం నిధుల విడుదలను సీఎం జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు నేరుగా బదిలీ చేశారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన ఆయన నిడదవోలు సమీపంలోని సుబ్బరాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి బస్సులో 11.07 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకున్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. అనంతరం జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆద్యంతం ఉత్సాహంగా ప్రసంగం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఉదయం 11.43కు ప్రారంభమై 12.20 గంటల వరకూ సాగింది. ఆయన ప్రసంగంతో సభలో ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది. సీఎం ప్రసంగిస్తున్నంతసేపూ ఈలలు, చప్పట్లతో ప్రజలు, అభిమానులు మద్దతు పలికారు. ప్రజల ఉత్సాహం చూసి సీఎం సైతం చిరునవ్వుతో అభివాదం చేశారు. వివక్షకు తావు లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పగానే మహిళలు ఒక్కసారిగా పైకి లేచి ఈలలు వేశారు. ఏ ప్రభుత్వంలోనూ ఇవ్వనన్ని ఉద్యోగాలు ఇచ్చామని, ప్రతి ప్రభుత్వ శాఖలో జగనన్న ఉద్యోగులు ఉన్నారని చెప్పగానే.. ఒక్కసారిగా 'జై జగన్' అంటూ నినదించారు. యువత, ఉద్యోగులను చంద్రబాబు మోసం చేశాడని, వెన్నుపోటు పొడిచే ఆయనతో జాగ్రత్తగా ఉండాలని సీఎం జగన్ సూచించారు. చంద్రబాబు రూ.కోట్లు దోచుకుంటూంటే, ఆయనకు మద్దతు పలికే దొంగల ముఠా బాబును ఎలా కాపాడాలా అని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'రూ.కోట్లు దోచేస్తూంటే అరెస్టు చేయకూడదంట.. చట్టం ఎవరికైనా ఒక్కటే కదా?' అని ప్రశ్నించగానే.. 'అవును.. అవును' అంటూ ప్రజలు పెద్దపెట్టున సీఎంకు మద్దతు పలికారు. ఇన్నాళ్లూ ప్రశ్నించే వారు లేక చంద్రబాబు ఆటలు సాగాయని.. ఇప్పుడు పాపం పండిందని చెప్పారు. అవినీతిపై ప్రశ్నిస్తానన్న దత్తపుత్రుడు వాటాలు తీసుకుని, ప్రశ్నించకుండా జైలుకు వెళ్లి, ములాఖత్ పేరుతో మిలాఖత్ అయ్యాడని సీఎం అనగానే.. జనం ఒక్కసారిగా పైకి లేచి 'దొంగ.. ప్యాకేజీ స్టార్' అంటూ నినదించారు. ఇలా సీఎం ప్రసంగం మొత్తం ఫుల్ జోష్‌తో సాగింది.

అడుగడుగునా ఆత్మీయత

నిడదవోలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అడుగడుగునా ఆత్మీయత చూపారు. సీఎం రాక కోసం ఉదయం నుంచే ఎదురు చూశారు. సుబ్బరాజుపేట హెలిపాడ్ నుంచి సభా ప్రాంగణానికి వెళ్లే దారి పొడవునా జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. రోడ్డుకు ఇరువైపులా మహిళలు, యువత పూలవర్షం కురిపించారు. 'జై జగన్, పొలిటికల్ సూపర్‌స్టార్ జగనన్న' అంటూ నినాదాలు చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో చిన్నారులతో కళా ప్రదర్శనలు నిర్వహించారు. సీఎం జగన్ రాకతో నిడదవోలు గణేష్ చౌక్, గణపతి సెంటర్, బస్టాండ్, రైల్వే స్టేషన్, సింగవరం వెళ్లే రోడ్లలో ఎటూ చూసిన జనసందోహమే దర్శనమిచ్చింది. సభా వేదికపై సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ సత్కారం లభించింది. కాపు నేస్తం లబ్ధిదారులు, కాకినాడ ఎంపీ వంగా గీత, ఇతర ప్రజాప్రతినిధులు శాలువా కప్పి, సన్మానించారు. కాపు నేస్తం డెమో చెక్కు పంపిణీ అనంతరం చేతిలో చెయ్యి వేసి, మహిళలు మద్దతు తెలిపారు. సభా వేదిక వద్ద వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు సభికులను అలరించాయి.



సభాప్రాంగణంలో సీఎం ఫ్లకార్డులు చూపిస్తున్న మహిళలు



సభాప్రాంగణం లోపల.. బయట.. ఎటు చూసినా జనమే..

హెలిపాడ్ వద్ద ఘన స్వాగతం

అంతకుముందు హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, వంగా గీత, కోటగిరి శ్రీధర్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్పీ చైర్మన్లు విప్పర్తి వేణుగోపాలరావు, ఘంటా పద్మావతి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, పోతుల సునీత, బొమ్మి ఇజ్రాయిల్, కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్‌నాయుడు, కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణరెడ్డి, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు, గ్రంధి శ్రీనివాస్, ఆళ్ల నాని, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్ కృష్ణ, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితానికి నడుం బిగించిన సంస్థలు



బీచ్‌లో సేకరించిన వ్యర్థాలతో కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో పర్యావరణ హితానికి పూనుకున్నారు. తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అంతర్జాతీయ తీర పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా శనివారం ఇండియన్ గార్డు, కస్టమ్స్‌శాఖ ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టాయి. ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ మేనేజరు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు రత్నేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని ఆయన హితవు పలికారు. పర్యావరణాన్ని కాపాడుకోపోతే ఆక్సిజన్‌ను కొనుక్కోవల్సి వస్తుందని సెంట్రల్ కస్టమ్స్ శాఖ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మరో కార్యక్రమంలో పేర్కొన్నారు. ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో కస్టమ్స్ డిపార్టుమెంట్, రామచంద్రపురం కృత్తికంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాకినాడ పీఆర్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, రేడియో అల 90.8ఎఫ్ఎం, డ్వాక్రా మహిళలు, సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు, నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నవదంపతులు సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించినట్టు అధికారులు తెలిపారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో నాలుగు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

సత్యరథానికి బ్రహ్మరథం



సత్యదేవుని సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో 20 రోజులుగా సత్యదేవుని ప్రచార రథంతో నిర్వహిస్తున్న హిందూ ధర్మ ప్రచారానికి గిరిజనులు బ్రహ్మరథం పడుతున్నారని అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఏజెన్సీ కేంద్రమైన చింతూరులో శనివారం నిర్వహించిన సత్యదేవుని సామూహిక వ్రతాలకు విశేష స్పందన లభించింది.

వందలాది మంది గిరిజనులు సత్యవ్రతాలు వ్రతాలు ఆచరించారని ఈఓ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బోర్డర్‌కు సమీపంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం 'కుంట' గ్రామంలోని మణికేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కుంట, పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న తెలుగువారు ఈ వ్రతాల్లో పాల్గొనాలని కోరారు. సామూహిక వ్రతాల్లో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, సూపరింటిండెంట్ కంచి మూర్తి, అర్చకులు నర్సింహమూర్తి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి అగ్రాసనం

- వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా జిల్లాలో 46,557 మందికి లబ్ధి
- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

కాకినాడ సిటీ: వైఎస్సార్ కాపునేస్తం పథకం ద్వారా ఈ ఏడాది జిల్లాలో 46,557 మంది లబ్ధిదారులకు రూ.69.83 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ తెలిపారు. శనివారం వైఎస్సార్ కాపునేస్తం పథకం ద్వారా కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల మహిళలకు రూ.15 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా స్థాయి కార్యక్రమం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాపునేస్తం ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి ప్రారంభించాక ఇక్కడి అధికారులు పథకం లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు.

పేదల జీవన ప్రమాణాల పెంపు

ఈ సందర్భంగా ఇలక్కియ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలలో పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా మహిళా సాధికారత లక్ష్యంగా పథకాలు అమలు చేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్లలోపు అర్హులైన మహిళలకు ఏటా రూ. 15 వేలు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 46,557 మందికి రూ. 69.83 కోట్లు మేర లబ్ధి చేకూరిందని జేసీ ఇలక్కియ అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ అధికారి టీవీ ప్రసాద్, బీసీ సంక్షేమశాఖ సూపరింటెండెంట్ జి సతీష్, బీసీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ బి రమావతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.


జగనన్నకు పలుకుదాం.. ఘన స్వాగతం: సీఎం జగన్ రోడ్ షోలో మహిళా కెరటం


ఈ అపురూప ఘట్టాన్ని ఫోనులో బంధిద్దాం: సీఎం జగన్‌కు ఫొటోలు తీస్తున్న యువతి


మామయ్య దగ్గరకు వెళ్దాం పదండి: బిడ్డల్ని తీసుకుని సభకు వెళ్తున్న మహిళ


ప్రియనేత ప్రసంగం వినాలని..: సభకు వస్తున్న దివ్యాంగుడు


ఉత్సాహతరంగమై..: జై.. జగన్ అంటూ నినదిస్తున్న యువత


వడివడిగా: సీఎం సభకు తరలుతున్న మహిళా వాహిని

ప్రభంజనం


జనప్రవాహం: నిడదవోలు వీధుల్లో నుంచి సీఎం సభకు తరలుతున్న ప్రజానీకం


చల్లగా ఉండు తండ్రీ: వృద్ధురాలి ఉద్వేగం


ఆనందమానందమాయె: తమకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌ను చూసి చేతులు ఊపుతున్న జనం

జన సంక్షేమ సారథి.. ఆంధ్రప్రదేశ్ ప్రగతి వారధి.. జనహృదయ విజేత.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగు మోపిన వేళ.. నిడదవోలు పట్టణం జన ప్రభంజనాన్ని తలపించింది. తమ ప్రియ నేతను కళ్లారా చూసేందుకు.. ఆయన మాటలను చెవులారా విని, నవచైతన్యాన్ని పొందేందుకు.. జనం వెల్లువొచ్చిన గోదారిలా తరలి వచ్చారు. హెలిపాడ్ నుంచి సీఎం వచ్చే మార్గం.. పట్టణంలోని రోడ్లు.. సభా ప్రాంగణం లోపల.. బయట.. ఇలా ఎటు చూసినా జనసందోహమే. దారి పొడుగునా తమ అభిమాన నేతపై పూలజల్లులు కురిపించారు. ఆయన ప్రసంగాన్ని ఆద్యంతం శ్రద్ధగా విన్నారు. తమను చేయిపట్టి ప్రగతి దారుల్లో నడిపించే నేత ఆయనేనని త్రికరణ శుద్ధిగా నమ్ముతూ.. 'జై జగన్' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. – నిడదవోలు

'మట్టి' మేలు తలపెట్టవోయ్

- సాక్షి మీడియా గ్రూప్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో
- మట్టి విగ్రహాల తయారులో శిక్షణ శిబిరం
- ఉత్సాహంగా పాల్గొన్న స్కూలు విద్యార్థులు
- ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం


చిన్నారుల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న గణనాథులు


గణపతులను తయారు చేస్తున్న చిన్నారులు

కాకినాడ రూరల్: వినాయక చవితి అంటేనే ప్రకృతి పండగ. అందువల్ల మట్టి ప్రతిమలతో వినాయకుని కొలవడం పర్యావరణ హితమని కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ కార్యాలయ ఈఈ సందీప్ రెడ్డి అన్నారు. సాక్షి మీడియా గ్రూపు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ సురేష్ నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించాయి. శ్రీ ప్రకాష్ సినర్జీ, శ్రీభాస్కర్ స్కూల్ విద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ భంగిమల్లోని గణనాథుడి మట్టి విగ్రహాలు తయారు చేసేందుకు పోటీ పడ్డారు. తమలోని కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. చక చకా గణపతి తయారు చేసి మట్టి ప్రతిమలకు జీవం పోశారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు విగ్రహాలను ఆకట్టుకునేలా తయారు చేసిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నిర్వాహకులు ప్రకటించారు. మరో నలుగురికి కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేశారు.

ప్రకృతితో గణపతికి సంబంధమిది

ఈ సందర్భంగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితికి ప్రకృతికి సంబంధం ఉందన్నారు. వర్షాకాలంలో ఈ పండగ వస్తుందన్నారు. వర్షాలకు నీరు పారుతూ నదులు, రిజర్వాయర్లు, కాల్వలు ద్వారా సముద్రం వద్దకు పారుతూ వెళుతుందన్నారు. ఈ క్రమంలో నేలపై మట్టి పేరుకుపోతుందన్నారు. చవితికి మట్టి వినాయకుల విగ్రహాలకు మట్టి తీయడం వలన డీ సిల్టేషన్ అవ్వడంతో పాటు నేలలోకి కొత్త నీరు చేరుతుందన్నారు. సాక్షి మీడియాతో కలిసి నాలుగేళ్లుగా పాఠశాల విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలు తయారు చేయిస్తున్నామన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసే విగ్రహాల నిమజ్జనం వల్ల చేపలకు హాని కలుగుతుందన్నారు. విద్యార్థులు అందరూ విజేతలేనన్నారు. పాల్గొన్న వారిని అభినందించి బహుమతులు అందజేశారు. శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ వినాయక చవితి విగ్రహాలు తయారీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. సాక్షి మీడియా, కాలుష్య నియంత్ర మండలి తమ స్కూల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషకరలన్నారు. సాక్షి యాడ్స్ మేనేజరు ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిట్టి చిట్టి చేతులతో మట్టి వినాయక ప్రతిమలను చిన్నారులు అద్భుతంగా చేశారన్నారు. వారందరికి సాక్షి మీడియా గ్రూప్ తరఫున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యాడ్స్ ఎగ్జిక్యూటివ్ మల్లిక్, ఆర్సీ ఇన్‌చార్జి వి.రాజబాబు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు కార్యక్రమంలో ప్రథమ బహుమతిని శ్రీ ప్రకాష్ సీజర్జీ స్కూల్ 5వ తరగతి విద్యార్థిని అర్హదేకా, ద్వితీయ బహుమతిని 6వ తరగతి విద్యార్థిని అనఘ, తృతీయ బహుమతిని శ్రీభాస్కర్ స్కూల్ 6వ తరగతి విద్యార్థి ఎం.శ్రీనివాస్ గెలుచుకున్నారు. వీరికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ బహుమతులు అందజేశారు. కన్సోలేషన్ ప్రైజులను క్రిష్టి(శ్రీప్రకాష్ సీనర్జీ – 8వ తరగతి), సీహెచ్.దీపక్(శ్రీభాస్కర్ స్కూల్ – 8వ తరగతి), భావజ్ఞ(శ్రీప్రకాష్ స్కూల్ – 8వ తరగతి), ఐశ్వర్య (శ్రీప్రకాష్ స్కూల్ – 9వ తరగతి) గెలుచుకున్నారు. వీరికి ప్రిన్సిపాల్ శ్రీదేవి బహుమతులు అందజేశారు.



ఈఈ సందీప్ రెడ్డి చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న అర్హదేకా, అనఘ, ఎం.శ్రీనివాస్

మట్టి విగ్రహాలకు ప్రోత్సాహం



మట్టి విగ్రహాలు ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత, శ్రీ ప్రకాష్ సీనర్జీ స్కూల్ 30ఏళ్లగా మట్టి విగ్రహాలు తయారీపై అవగాహన కల్పిస్తుంది. శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత విజయ్ ప్రకాష్ మొదటి నుంచి మట్టి విగ్రహాలను ప్రోత్సహిస్తున్నారు. సాక్షి, పొల్యూషన్ బోర్డు కృషి అభినందనీయం.

– శ్రీదేవి,
శ్రీ ప్రకాష్ సీనర్జీ స్కూల్ ప్రిన్సిపాల్